సాక్షి ప్రకాశం
బుధవారం । 14 । జూన్ । 2023



రక్త బంధువులు

రక్తదానం ఆపన్నుల ప్రాణాలను కాపాడుతుంది. అపోహలు వీడి రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినవారవుతారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కథనం.

- 8లో..



మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి

విపత్తులు ఎదురైనప్పుడు వాటి నుంచి బయటపడేందుకు కొన్ని విధానాలు నేర్చుకోవాలని ఎన్డీ ఆర్‌ఎఫ్ ఎన్‌స్పెక్టర్ జిటన్‌సింగ్ పేర్కొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
43.7 /29

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని రాక



ఒంగోలు: మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం ఒంగోలు రానున్నారు. ఈ మేరకు బాలినేని శ్రీనివాసరెడ్డి కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. మంగళవారం రాత్రి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి బయల్దేరి బుధవారం ఉదయం ఒంగోలుకు చేరుకుంటారు. అనంతరం స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

మూడు గంటలు ఆగిన ప్యాసింజర్ రైలు

సింగరాయకొండ: బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే మెము ప్యాసింజర్ రైలు ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషన్‌కు మంగళవారం ఉదయం 5 గంటలకు వచ్చింది. వెంటనే బయలుదేరాల్సి ఉండగా..దాదాపు 3 గంటల సేపు అక్కడే ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఏం జరిగిందో అర్థం కాక, రైలు ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక ఇబ్బందులు పడ్డారు. దీనిపై రైల్వే అధికారులను వివరణ కోరగా చిన్నగంజాం వద్ద రైల్వే ట్రాకు మరమ్మతు పనులు జరుగుతున్నాయని, అందువలన రైలు నిలిపివేసినట్లు చెప్పారు. చివరికి రైలు 7.50 గంటలకు బయలుదేరి వెళ్లటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

మిగిలిపోయిన ఉపాధ్యాయులకు పోస్టింగ్స్

ఒంగోలు: ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ కారణాల రీత్యా బదిలీ స్థానాన్ని పొందలేకపోయిన ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులను ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం మంగళవారం రాత్రి నాటికి ఒక హెడ్మాస్టరు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. మిగిలిన ఉపాధ్యాయులకు కూడా మంగళవారం అర్ధరాత్రి నాటికి బదిలీ స్థానాలు కేటాయించేందుకు విద్యాశాఖ కార్యాలయ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. వీరందరూ బదిలీ ఉత్తర్వులు పొందిన వెంటనే సంబంధిత పాఠశాలలో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

కేజీబీవీలలో 27 మందికి స్థాన చలనం

ఒంగోలు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో సీఆర్‌పీ, పీఈటీ, నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టుల్లో పనిచేస్తూ అభ్యర్థన బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో 27 మందిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీఈవో పి.రమేష్‌ల నేతృత్వంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 35 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 34 మంది హాజరయ్యారు. వారిలో ఏడుగురు పాత స్థానాల్లోనే కొనసాగేందుకు ఆసక్తి కనబరచగా, మిగిలిన 27 మందిని నూతన స్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిరాశ్రయుల భవనం ప్రారంభం రేపు

ఒంగోలు అర్బన్: ఒంగోలులోని జీజీహెచ్ ప్రాంగణంలో నిర్మించిన నిరాశ్రయుల భవనాన్ని ఈ నెల 15వ తేదీ ప్రారంభించనున్నారు. నిర్వహణ బాధ్యత రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించినా ప్రభుత్వాల అనుమతులు, నిధుల విడుదలలో కొంత జాప్యం అయింది. దీంతో పూర్తయిన భవనం అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్‌లు రెడ్‌క్రాస్ సొంత నిధులతో నిరాశ్రయుల భవనం నిర్వహించాలని సూచించడంతో ఆ భవనాన్ని ప్రారంభించనున్నారు.

దీనికి బాలినేని, కలెక్టర్‌లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ తెలిపారు. దీనిలో ఆస్పత్రికి రోగుల వెంట వచ్చిన అటెండెంట్స్‌తో పాటు నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తామన్నారు. 50 మంది మహిళలు, 50 మంది పురుషులకు వసతి ఉంది.

గూడేల్లో ప్రగతి వీచిక..!


అడవే వారికి కన్న తల్లి..వన్యప్రాణులు వారి కుటుంబ సభ్యులు..అటవీ ఉత్పత్తులే వారికి ఆహారం..జీవనాధారం..
ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా వారి జీవన ప్రమాణాల్లో మార్పు రాలేదు. సంక్షేమ పథకాలు ఆమడ దూరం..సొంత గూడు కూడా కరువే..గుడిసెలే వారికి ఆవాసాలు..
వానొచ్చినా..పెద్దగాలొచ్చినా వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం..వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వీరి బతుకుల్లో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు.. బడి..
వైద్యం అలాగే కొండ..కోనల్లో సైతం సంక్షేమ పథకాలు అందేలా చూస్తోంది. అడవి దాటని జీవితాల్లో ఆధునిక జీవన రేఖలు ఏర్పడుతున్నాయి.యర్రగొండపాలెం మండలం అల్లిపాలెం పరిస్థితి చూసొద్దాం..
ఇప్పుడు అక్కడ ఎలా ఉంది.. రానున్న రోజుల్లో ఎలా మారబోతోందో తెలుసుకుందాం.

చలో చెంచుగూడెం..



అల్లిపాలెం వ్యూ

ఒంగోలు డెస్క్..



చెంచు గూడెంలో జగనన్న కాలనీ ఇల్లు (ప్రతీకాత్మక చిత్రం)

- చెంచుగూడెల్లో ఆధునిక జీవనరేఖలు
- బడి, ఆస్పత్రి, తాగునీరు, పక్కాగృహాలు సకల సౌకర్యాలు
- గూడెల్లోకే రేషన్, సంక్షేమ ఫలాలు
- జనజీవన ప్రపంచంలోకి అడవి బిడ్డలు
- 59 మంది చెంచు కుటుంబాలకు పట్టాలు పంపిణీ
- పక్కా గృహాలు తామే నిర్మించి ఇస్తామన్న మంత్రి ఆదిమూలపు సురేష్

నల్లమల అటవీ ప్రాంతం..పశ్చిమ ప్రకాశంలోని ఏడు మండలాల పరిధి 81 చెంచు గూడేల్లో 15 వేల మందికిపైగా నివాసం ఉంటున్నారు. యర్రగొండపాలెం మండల కేంద్రానికి సుమారు 30 కిలో మీటర్ల దూరంలో ఉంది అల్లిపాలెం చెంచుగూడెం. దట్టమైన అటవీ ప్రాంతం..కనీస రవాణా సౌకర్యం లేదు. 73 చెంచు కుటుంబాలు నివాసముంటున్నాయి. అన్నీ గుడిసెలే.. ద్విచక్ర వాహనం ఉన్న వారు మినహాయిస్తే మిగతావారు నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లి అక్కడ నుంచి ఆటోల ద్వారా నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటారు. సోలార్ విద్యుత్ కరెంటు సరఫరా అవుతోంది. దీని ద్వారానే నీటి వసతి..పొలాలకు జనరేటర్ల ద్వారా నీళ్లు ఇస్తున్నారు.

కోనేరు చుట్టూ..

శ్రీకృష్ణదేవరాయలు అటవీ మార్గం ద్వారా శ్రీశైలం వెళ్లే సమయంలో నీటి కోసం కోనేరు నిర్మించారని చారిత్రక కథనాలు ఉన్నాయి. నీటి వసతి ఉండడంతో శతాబ్దాల కిందటే చెంచులు ఇక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారని అంటుంటారు. అల్లిపాలెంగా పిలుచుకునే ఈ చెంచుగూడెం అడవిలో దొరికే సంపదతో వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో మావోలు ఎక్కువగా సంచరించేవారని, అలాగే నీటి కోసం వన్యప్రాణులు, మృగాలు సైతం ఇక్కడికే వచ్చి వెళ్లేవని తెలుస్తోంది. కాలక్రమంలో ఆ కోనేరు శిథిలమైపోయింది. సమస్యలు రోజుకు రోజూ పెరుగుతూ వస్తున్నాయి. అక్కడ చెంచులకు పరిస్థితులు అనుకూలించలేదు. గూడేనికి దిగువన తమ నివాసాల నుంచి 3 కిలో మీటర్ల దూరంలో తాము సాగు చేసుకుంటున్న పొలాల వద్దకు రావాలంటే భయపడేవారు. ఇటువంటి పరిస్థితుల్లో 2004లో వారు పొలాల వద్దే గుడిసెలు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. 2006వ సంవత్సరంలో అప్పటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి 55 మంది చెంచు కుటుంబాలు 350 ఎకరాలు సాగుచేసుకునేందుకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందచేశారు. ఆ భూములపై చట్టపరంగా వారికి హక్కు లభించినప్పటికీ అటవీశాఖాధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా చెంచులపై కన్నెర్రచేస్తూ వచ్చారు. అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునే హక్కులేదని హుంకరించారు. రెండు దశాబ్దాల నాటి నుంచి చెంచులు ఆందోళన చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. మండలంలోని గంజివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఈ అల్లిపాలెం చెంచుల గోడు విన్న ఆ పంచాయతీ సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకొని వెళ్లారు.



బొగిలి పోయిన పూరి గుడిసె ముందు వంట చేస్తున్న చెంచు మహిళ

అల్లిపాలెం..దశ తిరిగే

దశాబ్దాల కాలంగా సొంత గూడు కోసం పోరాటాలు చేసి అలసిపోయారు. పక్కా భవనాలు అనేది అల్లిపాలెం చెంచులకు తీరని కోరికగా మిగిలిపోయింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జోక్యం చేసుకోవడంతో అటవీ, రెవెన్యూ శాఖలు దిగివచ్చాయి. ఈ మేరకు 59 మంది అల్లిపాలెం చెంచులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీ చేయడమే కాదు పక్కాగా లేఅవుట్‌వేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తామని, గృహాలు కూడా నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మరో 14 చెంచు కుటుంబాలకు త్వరలో పట్టాలు మంజూరు చేయిస్తానని కూడా చెప్పారు. అలాగే రేషన్ బియ్యం ఇంటిముంగిటకే చేరేలా ప్రత్యేక ట్రాక్టర్ల ద్వారా పంపిణీకి రంగం సిద్ధం చేశారు. రానున్న రోజుల్లో గుడిసెల స్థానంలో పక్కా గృహాలు రానున్నాయి. అలాగే పిల్లలు చదువుకునేందుకు పాఠశాల, విద్యుత్, వైద్య సదుపాయాలు, పుష్కలంగా తాగునీరు ఇలా అన్నీ అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రానికి సుదూరంలో ఉన్న పాలుట్ల పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే ఇలా అన్ని వసతులూ సమకూరాయి. దశలవారీగా గిరిపుత్రుల జీవితాల్లో సరికొత్త కాంతులీననున్నాయి అన్నది అక్షర సత్యం.



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్(ఫైల్)

గిరిజనులను ఆదుకోవడమే లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను ఆదుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచులకు అన్ని విధాలుగా ఆదుకుంటాం. ప్రస్తుతం అల్లిపాలెం చెంచులకు ఇంటి పట్టాలు అందచేశాం. వారికి కేటాయించిన స్థలంలో లేఅవుట్ వేసి పక్కా గృహాలు నిర్మించి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తాం. ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన చెంచు రైతులు వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందటానికి సహకరిస్తాను. ఆయా పొలాల్లో 29 బోర్లు వేయించి నీటి వసతి కల్పించే ఏర్పాటు చేస్తాను. అల్లిపాలెంలో ఉన్న పిల్లలు స్థానికంగా చదువుకునేందుకు పాఠశాలను నిర్మించి అన్ని వసతులు కల్పిస్తాం.

– ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

అన్ని వసతులు సమకూరుస్తాం



అల్లిపాలెం చెంచులకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తాం. వారి జీవనం కోసం చెంచు ప్రత్యేక ఉపాధి పథకం పనులు ముమ్మరం చేయిస్తాను. చెంచుల పనిదినాలు పెంచి, అదనపు అలవెన్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. గూడెంలో మంచి నీటి వసతి, వైద్య సదుపాయాలు కల్పించి పిల్లల చదువుల కోసం తగు చర్యలు తీసుకుంటాం.

– బి.రవీంద్రరెడ్డి, పీవో, ఐటీడీఏ, శ్రీశైలం ప్రాజెక్ట్

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



పంచాయతీ పరిధిలో ఉన్న చెంచుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అల్లిపాలెం అటవీ ప్రాంతంలో ఉండటం వలన ప్రతి నెలా రేషన్ బండి వెళ్లలేక పోతోంది. 4 కిలో మీటర్ల దూరం నడిచివెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తుంది. రేషన్ రవాణా కోసం ప్రతినెలా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేస్తాను. దగ్గర ఉండి కాలనీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాను.

– డి.సుబ్బారెడ్డి, సర్పంచ్, గంజివారిపల్లె పంచాయతీ

మిద్దెలో ఉంటానని అనుకోలేదు



మిద్దెలో కాపురం చేస్తానని నేను అనుకోలేదు. ఇప్పుడు ఇంటి పట్టాలు ఇచ్చారు. త్వరలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్తున్నారు. సొంతింటిలో ఉండాలన్న నా కోరిక నెరవేరనుంది. నాకు చాలా ఆనందంగా ఉంది. మంత్రికి రుణపడి ఉంటాను.

– భూమని పోలమ్మ, గృహిణి, అల్లిపాలెం

కల నెరవేరింది



మా గూడెం వాసుల కల నెరవేరింది. పులులు సంచరించే ఈ ప్రాంతంలో గుడిసెలలో జీవనం గడుపుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. ఇళ్ల నిర్మాణాల కోసం 20 ఏళ్లుగా పోరాడినా లాభం లేకుండా పోయింది. మంత్రి, సర్పంచ్ చొరవ తీసుకోవడంతో మా సొంతింటి కల నెరవేరింది.

– కుడుముల బయ్యన్న, గూడెం పెద్ద, అల్లిపాలెం

గుడిసెలోనే పుట్టాను




నేను గుడిసెలో పుట్టాను, వర్షం వస్తే రాత్రింబవళ్లు ఇబ్బంది పడేవాళ్లం, పెద్ద గాలి వస్తే గుడిసె ఎగిరిపోయేది. జంతువుల భయంతో బతికేవాళ్లం. ఇప్పుడు జగనన్న కాలనీ నిర్మించేందుకు పట్టాలు ఇవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. బడి కూడా ఏర్పాటు చేస్తుండటం వలన నాతోటి వాళ్లకు చదువుకునే అవకాశం కలిగింది.

– భూమని వెంకటమ్మ, విద్యార్థిని, అల్లిపాలెం

తోడేళ్ల గుంపుతో చేరి విమర్శలా?

- రాష్ట్ర విభజన హామీలు ఏమయ్యాయో బీజేపీ నేతలు చెప్పాలి
- పారదర్శకత, జవాబుదారీతనం వైఎస్సార్ సీపీ మూల స్తంభాలు
- వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకోవాలని కుట్ర
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: తోడేళ్ల గుంపులో చేరిన భారతీయ జనతా పార్టీ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రకాశం జిల్లా చిన్నదోర్నాలలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ బురద పూసే కార్యక్రమాలు నిర్వహిస్తోందని ధ్వజమెత్తారు. ఈమధ్య కాలంలోనే తోడేళ్ల గుంపులో చేరిన బీజేపీ నాయకులు టీడీపీ బాటలో ప్రయాణిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తెలుగుదేశం పార్టీ ప్రోద్బలంతోనే బీజేపీ నేతలు మాట్లాడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. రెండూ పార్టీలు ఒకే పాట పాడుతున్నాయని విమర్శించారు. విశ్వసనీయతకు, నిబద్ధతకు మారు పేరు వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని, బీజేపీలాగా రాష్ట్రానికి ఒక పద్ధతి, మనుషులకు ఒక నీతి, సామాజిక వర్గానికి ఒక న్యాయం చేయడం తమకు చేతకాదన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందన్న విషయం ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వాలను కూల్చడం, మైనారిటీలను కించపరచడం, రిజర్వేషన్లను రద్దు చేయడం లాంటివన్నీ ఓటు బ్యాంకు రాజకీయమేనన్నారు. ఏదో ఒక విధంగా వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే బీజేపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ అవగతమైందన్నారు. ఎంత మంది కలిసొచ్చినా, ఎన్ని విమర్శలు చేసినా రాష్ట్రానికి బీజేపీ చేసిందేమిటో ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇచ్చిన హామీలు నెరవేర్చారా?, విద్యా సంస్థలకు సంబంధించిన నిధులు, పోలవరం ప్రాజెక్టు నిధులు, ప్రత్యేక హోదాకు సంబంధించిన వాగ్దానాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. నగదు బదిలీలో అవినీతి ఎలా సాధ్యమవుతుందో నిరూపించాలన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలను భయభ్రాంతులకు గురిచేసి వారిని గుప్పెట్లో పెట్టుకోవాలన్న దురాలోచన అవివేకమన్నారు.

పనుల్లో అలసత్వం వహిస్తే సహించం



మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం కేటాయించిన పనుల్లో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ, అభివృద్ధి అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా విభాగంలో తాగు నీటికి సంబంధించిన బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. బిల్లుల పెండింగ్‌లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పనికి సంబంధించి మస్టర్ పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎంపీడీవోలు తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, హార్టీకల్చర్ అసిస్టెంట్‌లు కలిసి హార్టీ కల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. దీనిలో సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, సచివాలయాల ఇన్‌చార్జ్ ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన పోలీసులకు ప్రశంసలు

ఒంగోలు టౌన్: తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్ పోలీసులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ ప్రశంసించారు. సెప్టెంబర్ 19 నుంచి 24 వరకు ఢిల్లీలో జరిగిన 7వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2022 జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ పోలీస్ శాఖ నుంచి ప్రాతినిథ్యం వహించిన తాలుకా పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డీఎస్‌బీ రత్నబాబు పెంచాక్ సిలాత్ పోటీలో రజత పతకం, తైక్వాండోలో కాంస్య పతకం సాధించాడు. నంద్యాల జిల్లాలో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యస్.ఫర్హతుల్లా పెంచాక్‌లో రజత పతకం, నెల్లూరు జిల్లాలో ఏఆర్‌లో మహిళా కానిస్టేబుల్‌గా చేస్తున్న ఏ.శ్రావణి కాంస్యం, ఆక్టోపస్‌లో విధులు నిర్వహిస్తున్న యం.షంషీర్ తైక్వాండోలో కాంస్యం చేజిక్కించుకున్నారు. పతకాలు సాధించిన పోలీసులకు ఏపీ పోలీసు శాఖ ప్రత్యేకంగా అడ్వాన్స్ ఇంక్రిమెంట్ మంజూరు చేసింది. జిల్లా కార్యాలయంలో పోలీసు జూడో విజేతలను అభినందించిన ఎస్పీ మాట్లాడుతూ...ప్రకాశం జిల్లా డీటీసీలో శిక్షణ పొంది అత్యుత్తమ ప్రతిభతో అనేక పతకాలను సాధించడం ఏపీ పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. ఒకవైపు విధులు నిర్వహిస్తూ మరోవైపు క్రీడల్లో సత్తా చాటడం గొప్ప విషయమని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు తగిన కృషి చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో అద్భుతమైన తర్ఫీదు పొందేందుకు సహకరించిన ఎస్పీ మలికా గర్గ్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, కోచ్ మనోజ్ సాయి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో, పెంచాక్ సిలాత్ పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

హుండీ ఆదాయం రూ.3,87,298

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు పూర్తయిన సందర్భంగా దేవస్థాన ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి రూ.3,87,298 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పీ కృష్ణవేణి తెలిపారు. గత సంవత్సరం రూ.3,41,260 వచ్చిందన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీ నరశింహాచార్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రానైట్ శ్లాబులు పడి కార్మికుడు మృతి

చీమకుర్తి: గ్రానైట్ శ్లాబులు మీదపడటంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు దీపు(26) మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం చీమకుర్తి శివారులోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో చోటుచేసుకుంది. గ్రానైట్ శ్లాబులను కంటైనర్‌లోకి లోడ్ చేస్తున్న సమయంలో పక్కకు జారి హెల్పర్ దీపుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కొట్రా గ్రామమని ఆధార్ కార్డును బట్టి పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి, ఎస్సై రామిరెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కొనకనమిట్ల: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఒంగోలు–గిద్దలూరు రహదారి కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కరేటి బాలనాగయ్య (40) తన మోటార్ సైకిల్‌పై పొదిలి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. బాలనాగయ్య ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు కూడా దెబ్బతినటంతో అందులో ఉన్నవారు కారును అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య వెంకట చెన్నమ్మ, కుమారుడు నాగరాజు ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న కొనకనమిట్ల ఎస్‌ఐ దీపిక తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి జరిగిన ప్రమాదంపై విచారణ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం బాలనాగయ్య మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్నారు.

ఎస్సై పేరుతో బురిడీ!

● రూ.50 వేలు నగదు కాజేసిన ఆగంతకుడు

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు పి.సద్దాంహుస్సేన్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఎస్సై పేరుతో మోసం చేసి నగదు కాజేశాడు. మంగళవారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సద్దాం హుస్సేన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'నేను ఎస్సైని మాట్లాడుతున్నా. నా ఫోన్‌పే పనిచేయడం లేదు. నా కుమార్తె ఫీజు కట్టాలి. పేటీఎం క్యూఆర్ కోడ్‌కు రూ.50 వేలు పంపు' అని చెప్పాడు. ఈ మాటలు నమ్మిన సద్దాం హుస్సేన్ వెంటనే రూ.50 వేలు నగదు బదిలీ చేశాడు. 10 నిమిషాల్లో వచ్చి నగదు ఇస్తానని చెప్పిన వ్యక్తి ఎంతకూ రాలేదు. తనకు వచ్చిన ఫోన్ నంబర్‌కు తిరిగి డయల్ చేయగా స్విచాఫ్ అని రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ అడ్వాన్స్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఒంగోలు: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ప్రథమ సంవత్సరంలో 31.08 శాతం, ద్వితీయ సంవత్సరంలో 36.16 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 11,024 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 3,276 మంది (29.72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 1,286 మందికిగాను 550 మంది (42.77 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా ప్రథమ సంవత్సరంలో 12,310 మందికిగాను 3,826 మంది (31.08 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను గత ఏడాదితో పోలిస్తే దాదాపు ఒకే రకంగా ఉన్నాయి. గత ఏడాది 36.51 శాతం ఉండగా ఈ ఏడాది 36.16 శాతం ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విభాగంలో 9,494 మందికిగాను 3372 మంది (35.52 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 1539 మందికిగాను 618 మంది (40.15 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 11,033 మందికిగాను 3,990 మంది (36.16 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

వేదాంత విద్యను అభ్యసించిన వారికి సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లను అందజేస్తున్న క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ

కనిగిరి రూరల్: బైబిల్ కాలేజీలో అందిస్తున్న వేదాంత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. స్థానిక దుర్గం బాప్టిస్ట్ చర్చిలో ఇమాన్యుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిబ్లికల్ స్టడీస్, ఐసీసీ బైబిల్ కాలేజీ అండ్ సెమినరీ ఆధ్వర్యంలో మంగళవారం బైబిల్ కాలేజీ అధినేత ఆర్ సేవల జోసఫ్ అధ్యక్షతన నిర్వహించిన వేదాంత విద్యను అభ్యసించిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేదాంత విద్యను అభ్యసించిన వారంతా పాస్టర్లుగా రూపాంతరం చెందుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల పట్ల చిత్త శుద్ధితో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బంధాల రాజు, వై ప్రభుమనోహర్‌దాస్, ఏసు దాసు, శ్రీజనాధన్, కేఎం మోజస్, దయానందం, కరుణాకర్, పీటర్, ప్రసాద్, సుభాషిణి, ప్లాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రక్త బంధువులు

సాయం చేయడానికి ఏం కావాలి? మంచి మనసుండాలి.. మన కోసం చేసేది మనతోనే పోతుంది. ఆపన్నుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది. సేవాతత్పరులు ఆచరించే సూత్రమిదే.. ఎవరో ఒకరి పంచన చేరి మంచినీరడిగితేనే ఎగాదిగా చూసే మనుషులున్న రోజులివి.. అలాంటిది రక్తం అడగగానే దానం చేసేందుకు ముందుకొస్తున్నారు కొందరు దాతలు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఊపిరిపోస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.. ప్రాణార్థుల పాలిట పెన్నిధిగా నిలుస్తున్న దాతల ప్రతి రక్తపు బొట్టుకూ 'సాక్షి' సలాం..



మార్కాపురం: అన్నదానం మహాదానం.. ఒకప్పటి మాట! రక్తదానం మహాదానం ఇది నేటి మాట.!! గర్భిణులకు కాన్పు సమయంలో, ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం చాలా అవసరం. సురక్షితమైన రక్తం, రక్త ఉత్పత్తుల ఆవస్యకత, రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్ లాండ్ స్టీనర్ మొదటి సారిగా రక్తాన్ని వర్గీకరించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని 2004 నుంచి ఏటా రక్తదాన దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. రక్తంలో ఏ, బీ, ఏ పాజిటివ్, బీ పాజిటివ్, ఏ నెగిటివ్, బి నెగిటివ్, ఓ గ్రూపు ఉన్నాయి. ఆరోగ్యవంతులైన వారు ప్రతి 3 నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసేటపుడు 1 యూనిట్ రక్తం తీసుకుంటారు. ఆ తర్వాత 24 గంటల్లోనే శరీరంలో రక్తం తయారవుతుంది. అయితే ఆర్‌బీసీ(రెడ్ బ్లడ్ సెల్) ఏర్పడటానికి 3 నెలల సమయం పడుతుంది. అందువల్ల మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిది. కనీసం 45 కిలోల బరువు ఉండి, 18–60 ఏళ్ల మధ్య వయసున్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు. దీని వల్ల గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవడంతోపాటు రక్తంలోని అదనపు ఇనుమును, అనేక రకాల క్యాన్సర్లను నియంత్రించవచ్చు. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరం కాగా కేవలం 40 లక్షల యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఒక యూనిట్ రక్తం ముగ్గురి జీవితాలను నిలబెడుతుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

అపోహలు వద్దు



యువత రక్తదానంపై అపోహలు వీడాలి. ఆరోగ్యవంతులైన వారు ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. మార్కాపురం శ్రావణి వైద్యశాలలో బుధవారం ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశాం. అందరూ ఉపయోగించుకోవాలి. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి.

– డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, రెడ్ క్రాస్ సోసైటీ అధ్యక్షులు



65 సార్లు రక్తదానం చేశా

నేను మార్కాపురం పట్టణంలో నివాసం ఉంటున్నా. నా బ్లడ్ గ్రూపు బీ పాజిటివ్. గతంలో వెలిగొండ ప్రాజెక్టులో పనిచేశా. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగిని. ఇప్పటికి 65 సార్లు రక్తదానం చేశా. నాకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. చాలా యాక్టివ్‌గా ఉన్నా. ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుంటా. యువత రక్తదానానికి ముందుకు రావాలి.

– ఆర్.ప్రసాద్, మార్కాపురం

యువతలో అవగాహన వస్తోంది

నేను ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా. యువ కేర్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి రక్తదానంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్న. నా బ్లడ్ గ్రూపు ఏ పాజిటివ్. ఇప్పటి వరకు 25 సార్లు రక్తమిచ్చాను. యువతలో ఇప్పుడిప్పుడే రక్తదానంపై అవగాహన వస్తోంది.

– ఆరీపుద్దీన్, మార్కాపురం





25 రక్తదాన శిబిరాలు నిర్వహించా

నేను ఎస్‌ఆర్‌ఈజీలో ఉద్యోగిగా పనిచేస్తున్నా. ఇప్పటికి 45 సార్లు రక్తదానం చేయటంతోపాటు దాదాపు 25సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంక్‌కు అందించా. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. మరింత మంది యువత రక్తదానానికి ముందుకు రావాలి.

– అనిల్, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగి



మహిళకు రక్తం అందజేస్తున్న చల్లా అశోక్‌రెడ్డి

'మేమున్నాం'.. రక్తం విలువను చాటిచెబుతాం

● సేవా సంస్థ ఆధ్వర్యంలో 10 వేల మందికి రక్తదానం

కొమరోలు: తన చిన్నతనంలో సోదరి ఆపరేషన్‌కు రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు పడిన ఓ బాలుడు ప్రస్తుతం వేలాది మందికి రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలబెడుతున్నాడు. కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన చల్లా అశోక్‌రెడ్డి 'మేమున్నాం సేవా సమితి' ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా దాదాపు 10 వేల మందికి రక్తదానం చేసేలా దాతలను ప్రోత్సహించాడు. గిద్దలూరు, నంద్యాల, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, తిరుపతి, కడప, ఇలా ఏ ప్రాంతంలో రక్తం కావాలన్నా మేమున్నాం సేవాసమితి సభ్యులు సిద్ధంగా ఉన్నారని అశోక్‌రెడ్డి ధీమాగా చెబుతున్నాడు. ఇప్పటి వరకు 32 సార్లు రక్తదానం చేసిన అశోక్‌రెడ్డి.. సోషల్‌మీడియా ద్వారా రక్తం ఆవశ్యకతను వివరిస్తూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని కోరుతున్నాడు. బుధవారం మేమున్నాం సేవాసమితి ఆధ్వర్యంలో గిద్దలూరులోని రేడియో బావి సెంటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చల్లా అశోక్‌రెడ్డి తెలిపాడు.

రక్తదానంలో మాస్టారు 'లెక్కే' వేరు

మద్దిపూడి: కనిగిరికి చెందిన శ్రీరామ హజరత్ మురళీధరరావు రక్తదానంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆయన మద్దిపూడి మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆపదలో ఉన్న వారి కోసం ఇప్పటి వరకు 22 సార్లు రక్తదానం చేశారు. బాధితుల కళ్లలో ఆనందం చూస్తే తనకు ఎంతో సంతృప్తి కలుగుతుందని మురళీ మాస్టర్ సంతోషంగా చెబుతున్నారు.



రక్తాన్ని వైద్యశాల సిబ్బందికి అందజేస్తున్న శ్రీరామ్ మురళి

మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి

● విపత్తుల సమయంలో ఆపన్న హస్తం కోసం ఎదురు చూడొద్దు
● మత్స్యకారులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారుల హితబోధ
● రక్షణ చర్యలను ప్రయోగాత్మకంగా వివరించిన విపత్తుల స్పందన దళం



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

కొత్తపట్నం: "విపత్తులు చెప్పి రావు, ఊహించని ఉత్పాతం ఎదురైనపుడు సొంతగా బయటపడేందుకు, తోటివారిని రక్షించేందుకు కొన్ని విధానాలు నేర్చుకోవాలి" అని జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఇన్‌స్పెక్టర్ బీటన్ సింగ్ పేర్కొన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు విజయవాడ ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ బృందం మంగళవారం కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంలోని తుఫాన్ షెల్టర్ వద్ద మత్స్యకారులకు రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సింగ్ మాట్లాడుతూ.. వరదలు, తుఫాన్లు, భారీ అగ్నిప్రమాదాలు సంభవించినపుడు, భవనాలు కూలినపుడు, సునామీ, భూకంపాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు ఎన్‌డీఆర్‌ఎఫ్ చేస్తున్న కృషిని వివరించారు. విపత్తు వస్తుందని ముందుగా గ్రహిస్తే విలువైన ఆస్తి పత్రాలు, సామగ్రిని భద్రపరుచుకోవాలని సూచించారు. వాటర్ బబుల్లు, క్యాన్లు, థర్మాకోల్ షీట్లు, ఎండిన కొబ్బరి బొండాలతో తయారు చేసుకున్న పరికరాలు, లైఫ్ జాకెట్స్, బోటు సాయంతో ఏ విధంగా ప్రాణాలు రక్షించుకోవచ్చో ఎన్‌డీఆర్‌ఎఫ్ కానిస్టేబుల్ గోవిందరావు ప్రయోగాత్మకంగా వివరించారు. విపత్తుల సమయంలో గుండెనొప్పితో బాధపడేవారిని, పాముకాటుకు గురైన వారిని, గాయపడిన వారిని రక్షించే పద్ధతులు తెలియజేశారు. మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు తదితరులు మాట్లాడుతూ.. విపత్తులు వచ్చినప్పుడు ముందుగా మత్స్యకార కుటుంబాలే దెబ్బతింటాయని, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మేలని చెప్పారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సై సుబ్బారావు, మూడు జిల్లాల మత్స్యకార కార్మిక సంఘం అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి వైవీ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేష్, ఎఫ్‌డీవో ఆశా, సందీప్‌రెడ్డి, గుండమాల సర్పంచ్ కారాని జయరావు, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహరావు, ఫిషరీస్ అసిస్టెంట్ కృష్ణారావు, కాపులు తమ్మ వెంకటేశ్వర్లు, పాండు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం భేటీ

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాకు వచ్చిన 19 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కలెక్టర్‌ను కలిసి తమ కార్యక్రమాలను వివరించింది. ఈ నెల 27వ తేదీ వరకు జిల్లాలోని తీర ప్రాంత గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలు, అధికారులు, వలంటీర్లు, విద్యార్థులకు విపత్తులు ఎదురైనపుడు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు తెలిపారు.



విపత్తుల సమయంలో ప్రాణాలు రక్షించుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

గ్యాస్ లీకై హోటల్ దగ్ధం

● సుమారు రూ.7.50 లక్షల ఆస్తినష్టం
● సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో ఘటన



హోటల్లో ఎగిసిపడుతున్న మంటలు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్ లీకవడంతో హోటల్ దగ్ధమై సుమారు 7.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఊళ్లపాలెం పంచాయతీ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కూచపాటి రాజారావు హోటల్ నిర్వహిస్తున్నాడు. ఉదయం గ్యాస్ పొయ్యి వెలిగించే క్రమంలో మంటలు చెలరేగాయి. భయాందోళనకు గురైన రాజారావు, కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. మంటలు ఎగిసిపడటంతో హోటల్ పూర్తిగా దగ్ధమైంది. హోటల్లోనే నివాసం ఉంటున్న రాజారావు ఒక గదిలో దుస్తుల వ్యాపారం కూడా చేస్తున్నాడు. ఈ ప్రమాదంలో రెండు ఫ్రిజ్‌లతో పాటు, ఫర్నిచర్, సుమారు రూ.2 లక్షల విలువైన వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలు, బంధువుల ఇంట శుభకార్యానికి తీసుకెళ్లేందుకు దాచి ఉంచి రూ.2 లక్షల నగదు కాలి మొత్తం సుమారు రూ.7.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, భాస్కరలింగం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. స్థానికుల సమాచారంతో టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపుచేశారు. రక్షణ చర్యల్లో టంగుటూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సీహెచ్ బంగారు బాబు, హెడ్ కానిస్టేబుల్ పి.సత్యనారాయణ, సిబ్బంది ఎ.కిషోర్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

అర్ధవీడులో 11 పూరిళ్లు బుగ్గి



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అర్ధవీడు(కంభం): ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 11 పూరిగుడిసెలు కాలిపోయిన సంఘటన సోమవారం అర్ధరాత్రి అర్ధవీడులో చోటుచేసుకుంది. వివరాలు.. గురుకుల పాఠశాల సమీపంలోని చెంచు కాలనీలో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. కంభం నుంచి ఫైరింజన్ అక్కడికి చేరే లోపే గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. కాలనీలో నివాసం ఉంటున్న దాసరి యాగయ్య, దాసరి లక్ష్మయ్య, దాసరి అంకన్న, దాసరి గంగమ్మ, భూమని వెంకటేశ్వర్లు, నాగుల రాముడు, నాగుల నడిపిరాజు, నాగుల చిన్నరాజు, నాగుల పెద్దరాజు, నాగుల పెద్దరాజులు, నాగుల ఆంజనేయులుకు చెందిన పూరిగుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

పొట్టకూటికొచ్చి విగతజీవిగా..

● విద్యుదాఘాతంతో జార్ఖండ్ యువకుడు మృతి



మృతి చెందిన మార్కొండోపుట్టి

కురిచేడు: పొట్టకూటి కోసం రాష్ట్రాలు దాటి విద్యుత్ పనులకు వచ్చిన ఓ యువకుడి పాలిట అవే తీగలు యమపాశాలయ్యాయి. ముండ్లమూరు మండలంలోని ముప్పగంగవరం గ్రామ పొలాల్లో విద్యుదాఘాతానికి గురై జార్ఖండ్‌కు చెందిన మార్కొండోపుట్టి(37) మృత్యువాతపడ్డాడు. ఎస్సై ఎం.దేవకుమార్ కథనం ప్రకారం.. మార్కొండోపుట్టి(37) విద్యుత్ పనుల కోసం మరి కొందరితో కలిసి జార్ఖండ్ నుంచి వచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే క్రమంలో ఒక వైపు విద్యుత్ సరఫరా నిలిపివేసి తీగలు లాగారు. రెండో వైపు ఎల్‌సీ తీసుకోకుండానే పని హడావుడిలో స్తంభం ఎక్కి జంపర్లు కలిపేందుకు యత్నించిన మార్కండోపుట్టి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పుట్టి మృతితో తోటి కార్మికులంతా విలపించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

● రూ.1.90 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శశికుమార్

మార్కాపురం: ఈ నెల 8న పట్టణంలోని నాయుడు బజారులో సీతారామాంజనేయ పెయింట్ షాపులో జరిగిన దొంగతనం కేసులో నిందితుడైన తుపాకుల వెంకటేశ్వర్లును మంగళవారం పట్టణ శివారులోని ఎస్టేట్‌లో అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై శశికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు సమీపంలోని దాసరిపాలేనికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు పాత నేరస్తుడని, గత కొంత కాలంగా మార్కాపురంలో ఒక మహిళతో సహజీవనం చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. నిందితుడి నుంచి రూ.1.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు ఉన్నట్లు విచారణలో గుర్తించామన్నారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేటపుడు పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇంటిపై నిఘా ఉంచుతామని తెలిపారు.